

నిధుల కేటాయింపుపై ఎంపికి కృతజ్ఞతలు

ఎంపీ అనురాధను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

మండపేట నియోజకవర్గంలో రాయవరం మండలంలో అభివృద్ధి పనుల కోసం ఎంపీ లాడ్స్ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినందుకు అమలాపురం ఎంపీ చింతా అనురాధను మండలంలోని పలువురు నాయకులు శనివారం కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని అల్లవరం మండలం మొగళ్లమూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసిన వారిలో రాయవరం జెడ్పిటిసి సభ్యులు నల్లమిల్లి మంగతాయారు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణంలో జాప్యం

- 216ఎ జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద 8 నెలల క్రితం భూమి పూజ
- ఇప్పటివరకూ పూర్తి కాని ఒక్క పిల్లర్ నిర్మాణం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జొన్నాడ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ఆలమూరు

ఇటీవల ప్రమాదాలకు చిరునామాగా 216ఎ జాతీయ రహదారి జొన్నాడ సెంటర్ మారింది. జొన్నాడ ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష ఈ ఏడాది మొదట్లో సుమారు 8 నెలల క్రితం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వెంటనే పనులు ప్రారంభించి వేగంగా నిర్మాణం పూర్తి చేస్తారని స్థానికులు ఆశించారు. పనులు మొదలు పెట్టారు కానీ అప్పటి నుంచి పనుల్లో జాప్యం చేస్తూ సాగదీతగా నడుస్తున్నాయి. దీనికి ఉదాహరణ ఫ్లై ఓవర్‌కు 8 పిల్లర్లు వేయాల్సి ఉండగా ఇంతవరకు ఒక్క పిల్లర్ కూడా నిర్మాణం జరగలేదు. అప్పటి నుండి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడుగా ఇక్కడే మైనింగ్ చెక్ పోస్ట్ కూడా ఉండడంతో వాహనాల రద్దీ మరింత అధికమయ్యింది.

కానరాని సూచిక బోర్డులు

అయితే ప్రమాద సంకేతానికి ఎక్కడ సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని జొన్నాడ సెంటర్లో 216(ఎ)పై వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. అలాగే సర్వీస్ రోడ్ల నిర్మాణంలోను నిర్లక్ష్యం తాండవిస్తోంది. కాంట్రాక్టర్ అశ్రద్ధతో సరైన రీతిలో రోడ్డును నిర్మించకపోవడంతో వాహన చక్రాలు జారుతున్నాయి. ఇటీవల అదే రీతిలో కడియం గ్రామానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనం చక్రాలుజారి భారీవాహనం క్రిందపడి మృతి చెందాడు. అలాగే ఇటీవల వ్యవసాయ రైతు ట్రాక్టర్ కుప్పకూలింది, ట్రాలీ పైన రైతులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ నెల 6న మూడు చక్రాల గూడ్స్ ఆటో బోల్తా పడింది. రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సు ప్రయాణికులకు కనీసం తాత్కాలిక బస్సు షెల్టర్లు నిర్మించకపోవడంతో ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో మండుటెండలో ప్రయాణికులు ఉన్నారు.

నిర్మాణ పనుల వద్ద ప్రయాణికుల అవస్థ

పెరుగుతున్న ప్రమాదాలు

మరో పక్కన మట్టి, ఇసుక, గ్రావెల్ వంటి భారీ వాహనాలకు మైనింగ్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. మైనింగ్ టాక్స్ వసూళ్లతో భారీ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. అలాగే రహదారి మధ్యలో సరైన సూచిక బోర్డులు(రేడియం, లైటింగ్) స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో రాజమహేంద్రవరం వైపు నుంచి ప్రయాణించే ప్రయాణికులు రాత్రి సమయంలో వ్యతిరేక దిశలోకి చేరుకుంటున్నారు. దీంతో ప్రమాదాలు అధిక సంఖ్యలో పెరిగి పోతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఫ్లై ఓవర్ పనులపై దృష్టి పెట్టాలని పలువురు కోరుచున్నారు.

బోల్తాపడిన గూడ్స్ ఆటో(ఫైల్ ఫోటో)

తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆందోళన

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణం మున్సిపల్ వర్కర్స్ కాలనీలో సుమారు 15 రోజుల నుంచి తాగునీరు కుళాయిల్లో నీరు రాకపోవడంతో స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ వర్కర్స్ అయిన వారు తమ విధుల నిర్వహణలో భాగంగా ఉదయం 5 గంటలకి ఇంటి నుంచి వెళ్లి తిరిగి 10 గంటలకు ఇంటికి వచ్చేసరికి ఇంటి వద్ద నీళ్లు లేకపోవడంతో వంట వండుకోవడానికి తాగటానికి ఇంటి అవసరాల కొరకు నీరులేక తీవ్ర ఇబ్బందుల పాలు అవుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు తమ గోడు విన్నవించుకున్న పట్టించుకునే నాధుడు లేడని మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్థానిక మహిళలు మున్సిపల్ కాలనీలో ఖాళీ బిందెలతో తమ నిరసన తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మున్సిపల్ వర్కర్స్ కాలనీకి మంచినీటి ఇబ్బందిని పరిష్కరించవలసిందిగా వారు కోరుతున్నారు.

మున్సిపల్ కాలనీలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన వైద్య బృందం

ప్రజాశక్తి-అమలాపురం

భారతదేశ గర్వించదగ్గ ప్రపంచ జీనోమ్ ఫార్మసీ వైద్య బృందం డాక్టర్ ఆనంద్‌కు, డాక్టర్ సుబ్బారావుకు అమలాపురం పట్టణానికి చెందిన ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో శనివారం మంత్రి విశ్వరూప్ క్యాంప్ కార్యాలయంలో విశ్వరూప్ ను కలిశారు. వైద్యులు ఆనంద్, సుబ్బారావు మాట్లాడుతూ విష సర్పాల కాటుకు నేడు ఉన్న మెడిసిన్ ప్రభావంతంగా పనిచేయడం లేదని కోనసీమ జిల్లా ప్రాంతంలో అధికంగా విష సర్పాలు ఉన్నాయని వాటి కాటు వల్ల ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు సరికొత్త మెడిసిన్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఒఎన్‌జిసి వంటి సంస్థల వల్ల కలుషిత మైన మీరు వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని కిడ్నీ రోగి లకు రూ.మూడు లక్షల ఖర్చుతో వైద్యం అందించి పేద ప్రజలను ఆదుకుంటామని వారు అన్నారు. డాక్టర్ ఆనంద్‌కు, డాక్టర్ సుబ్బారావుకు ఎంఎల్‌సి కుడుపూడికి బాల్యమిత్రులని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

మంత్రి విశ్వరూప్‌తో వైద్యులు ఆనంద్,సుబ్బారావు తదితరులు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అన్నారు. 1956 అక్టోబర్ 14న లక్షలాది మందితో అంబేద్కర్ బౌద్ధ మతం స్వీకరించిన సందర్భంగా శనివారం గొల్లవిల్లి శాంతినగర్ లో అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు,బేడ బుడగ జంగం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారురు. అనంతరం బాబ్జి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరు నడిచి ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం సంఘ జిల్లా అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్, పేర్ల మరిడియ్య,పండు రాజేష్,పేర్ల గౌరమ్మ,దుర్గా భవాని, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'కొబ్బరి' ఇ-పంట నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు శనివారం కామనగరువు, చిందాడగరువు గ్రామాల్లో కొబ్బరి ఇ-పంట నమోదు ప్రక్రియ పరిశీలించారు. ఆయన పంట నమోదు ప్రక్రియ శనివారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఎ షంషి, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కామనగరువులో కొబ్బరి రైతుతో మాట్లాడుతున్న బోసు బాబు

వెంకన్నఆలయంలో విరాళం అందజేస్తున్న దాతలు

అన్నదానానికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి . కపిలేశ్వరపురం

అంగరలో కొలువైయున్న అలివేలుమంగా, గోదాదేవి, సమేత వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం అన్నదానం నిమిత్తం దాత ఒకరు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన మోటి పల్లి రామచం ద్రరావు, కృష్ణవేణి, దంపతులు ఈ విరాళాన్ని స్వామివారికి అందజేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు .ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను అర్చకులు కె.బాల బాలాజీ ఆచార్యులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షించడం అందరి బాధ్యతని అనూస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ అన్నారు. శనివారం ర్యాలీలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో క్లాత్ బ్యాగులు వాడదాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాలు చేసుకుంటూ200 క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ కోర్సు శిక్షకురాలు శారద మహిళలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

చివరకు మనమెక్కిన చెట్టును మనమే నరుక్కున్నట్టుంది సార్..!!

మాజీ ఎంఎల్‌ఎ రామకృష్ణ చౌదరి కన్నుమూత

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణానికి చెందిన రాజకీయ దిగ్గజం, రెండు సార్లు అనపర్తి నియోజకవర్గ ఎంఎల్‌ఎగా పనిచేసిన వల్లూరి రామకృష్ణ చౌదరి (77) శనివారం కన్నుమూశారు. 1967లో మండపేట అనపర్తి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేది.1978 లో ఆలమూరు నియోజకవర్గం ఏర్పడి మండపేట అందులో విలీనం అయింది. మండపేటకు చెందిన వల్లూరి రామకృష్ణ రెండు సార్లు అనపర్తి ఎంఎల్‌గా సేవలు అందించారు. వివాదరహితునిగా, కాంగ్రెస్ వాదిగా జీవితాంతం నిబద్ధతతో వున్నారు. 1967 ఎన్నికల్లో ఆయన తొలిసారిగా కాంగ్రెస్ నుంచి అనపర్తి ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారు. రెండో సారి 1972 మార్చి 5 న రామకృష్ణ చౌదరి శాసనసభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో తొలిసారిగా అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యునిగా పోటీ చేసి గెలుపొందారు. 1972లో కింగ్ మేకర్ దివంగత రాయవరం ఉండవిల్లి సత్యనారాయణమూర్తి మద్దతుతో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. రామకృష్ణచౌదిరి భార్య రాధమ్మ గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు వల్లూరి పాపారావు, వల్లూరి శ్రీనివాస్ లు వున్నారు. మాజీ ఎంఎల్‌ఎ రామకృష్ణ చౌదరి మృతి పట్ల ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు.


రామకృష్ణచౌదరి(ఫైల్ ఫోటో)

సంతాపం తెలిపిన ఎంఎల్‌ఎ వేగుళ్ల

మాజీ ఎంఎల్‌ఎ వల్లూరి రామకృష్ణ చౌదరి మృతికి మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు సంతాపం తెలిపారు. శనివారం మండపేటలోని ఆయన స్వగృహంలో రామకృష్ణ చౌదరి పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వేగుళ్ల మాట్లాడుతూ పాత అనపర్తి నియోజకవర్గంలో రెండు పర్యాయాలు రామకృష్ణ చౌదరి ఎంఎల్‌ఎగా పనిచేసి నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి శ్రేయస్సు కోసం పని చేశారన్నారు.

చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-ఆలమూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబుకు మెరుగైన వైద్యం తక్షణమే అందించాలని కోరుతూ కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో మడికి శివారు చిలకలపాడు పరిధిలో శనివారం జరిగిన "బాబుతో నేను" కార్యక్రమంలో మోకాళ్లపై టిడిపి శ్రేణులు వినూత్న నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. **కాత్రేనికోన:** వైసిపి ప్రభుత్వం చంద్రబాబు ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోందని మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుకు వైద్యం అందించేందుకు వ్యక్తిగత వైద్యులను అనుమతించాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని యోగేశ్వరి ఆరోపించారు..

మడికి వద్ద నిరసనతెలుపుతున్న సత్యానందరావు, పార్టీశ్రేణులు

టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని కాలేరు గ్రామంలో 'బాబుతో నేను' నిర్వహించిన ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసుల వివరాలను ప్రజలకు వివరించారు చంద్రబాబు ప్రకటించిన మ్యాని పెస్టోను ప్రజలకు వివరించి, కరపత్రాలను అందజేస్తూ టిడిపిని గెలిపించాలని కోరారు గ్రామంలో పర్యటించిన ఎంఎల్‌ఎను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ముత్యాల వెంకటరావు, పువ్వల చిట్టిబాబు, రెడ్డి ప్రసాద్, అల్లూరి రామకృష్ణ, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు **రామచంద్రపురం** మండలంలోని మాలపాడు గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని టిడిపి ఇన్‌ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బాబుతో నేను కార్యక్రమం పలు అభివృద్ధి అంశాల పైనా మాట్లాడారు. అనంతరం రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సుబ్రహ్మణ్యానికి ఘన స్వాగతంపలికారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొత్తపల్లి శ్రీను, నియోజకవర్గ ముఖ్య నాయకులు, గరికపాటిసూర్యనారాయణ, చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి రవికుమార్, కడియాల రాఘవన్, బలుసు శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జ్‌లు, యూనిట్ ఇన్చార్జ్లు, కార్యకర్తలలు పాల్గొన్నారు.

కాలేరులో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల

ఘనంగా దసరా ఉత్సవాలు

విద్యార్థులనుఅభినందిస్తున్న సహస్రస్కూల్ డైరెక్టర్ వేణు

నేతాజీ స్కూల్లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాల్లో ముందస్తు దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వివరాలు ఇవి.

అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ నందు శనివారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నవదుర్గల వేషధారణ, రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలను సంబంధించి విద్యార్థుల వేషధారణలు అకట్టుకున్నాయి. అదేవిధంగా తెలంగాణలో జరుపుకునే బతుకమ్మ సంబరాలను విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు వారిచే బతుకమ్మలను తయారు చేయించి, బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆర్. వేణుగోపాలరావు, సహస్ర ప్రిన్సిపల్ గౌసియా బేగం, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాని రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ఆలమూరు** చెముడులంకలోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో దసరా ఉత్సవాలు కరస్పాండెంట్ యెరుబండి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ఇంచార్జ్ పద్మావతి, ప్రిన్సిపల్ సునంద, టీచర్లు ప్రవీణ, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఊరెళితే జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-ఆలమూరు

దసరా సెలవులు సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటకు వెళ్లే వారు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై ఎల్.శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు. మీ యొక్క విలువైన బంగారు, వెండి, నగదును సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు.అలాగే మీరు మీ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు పోలీసుస్టేషన్ లో తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా సెలవుల నేపథ్యంలో వేరే ప్రాంతాలకు వెళ్ళే ఆయా గ్రామాల వారు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన ప్రదేశాల్లో దొంగతనాలు జరగకుండా పోలీసులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. కొందరు తమ బ్యాగుల్లో నగదు, బంగారం, ఇతర ఆభరణాలను ఉంచుకుని బస్సుల్లో ఇతర వాహనాలలో ప్రయాణం చేసే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగా జాగ్రత్తలు పాటించాలని మరిన్ని వివరాలకు ఆలమూరు పోలీస్ స్టేషన్ 08855 278433 నెంబరుకు అత్యవసర సమయాలలో డయల్ 100 లేదా 112 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్ నాయక్

వైసిపి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యం

ప్రజాశక్తి-రాజోలు

వైసిపి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తున్నారని అమలాపురం పార్లమెంటరీ టిడిపి అంగన్‌వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు మోకా పార్వతి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు జిల్లా బండారు పాడ్డం మండలం, శాంతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతకు ఇచ్చిన పౌష్టికాహారంలో పాము కళేబరం కనిపించిన ఘటనపై సంబంధిత మంత్రి ఉషా చరణ్ ఇంతవరకు స్పందించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందించే బియ్యం ముక్కు కంపు వస్తున్నాయని, గుడ్లు కుళ్లి పోయి, పాలు పాడయి పోయి విష మతుల్యం గా మారు తున్నాయ న్నారు. వైసిపి నాయకు లకే వాటిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టులు ఇవ్వడంతో అడిగేవారు లేక అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన సరుకులు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ సిబ్బందికి పనిభారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా ఉందని అన్నా రు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యే వరకుప్రభుత్వంతో పోరాడతామని పార్వతి అన్నారు.

మోకా పార్వతి

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

విద్యతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాజ్ కమల్ ఫౌండేషన్ గౌరవ సలహాదారు, గణిత అవధాని టిఎస్‌వీఎస్.సూర్య నారాయణ మూర్తి అన్నారు. రాజ్‌కమల్ ఫౌండేషన్‌ను యర్రమిల్లి జయరామ్(యుఎస్‌ఎ) స్థాపించి పేద విద్యార్థులకు ఆర్థికపరమైన సేవలు అందిస్తున్నారు. జయరామ్ మామయ్య వారణాసి శ్రీరామచంద్రమూర్తి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్ కమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందపల్లి ఎంపిపి పాఠశాల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 23 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో ప్రతిభ కనబర్చిన 7గురు విద్యార్థునులు, 5గురు విద్యార్థు లకు ఫౌండేషన్ తరఫున పోస్టాఫీసు నందు పిపిఎఫ్ అకౌంట్ ఓపెన్ చేసి ప్రతి ఒక్కరికీ ప్రతీ సంవత్సరం కొంత నగదు ఇచ్చే ఏర్పాటు చేస్తారని మూర్తి వివరించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా కొత్తపాలెం జిల్లాపరిషత్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆదివరపుపేట వెంకటేశ్వరరావు వ్యవహరిస్తూ విద్యార్థులలో చక్కని ప్రతిభా పాటవాలను తగిన గుర్తింపు ఇచ్చిన రాజ్ కమల్ ఫౌండేషన్ అధ్యక్షులు యర్రమిల్లి జయరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సువర్ణ మాట్లాడుతూ ఫౌండేషన్ వారికి కతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. రమణ, రాధాభాయి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో రైఫిల్ షూటింగ్‌కు చల్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి సిహెచ్.వేణు ప్రసాద్ ఎంపిక య్యాడు. రాజమహేంద్రవరం ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన పోటీల్లో విద్యార్థి వేణు ప్రసాద్ పాల్గొన్నాడు. ఈ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా చల్లపల్లి ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థి వేణు ప్రసాద్ ను. శిక్షణ ఇచ్చిన పీడీ వెలుగొంట్ల కుమార్ గౌడను హెచ్‌ఎం గరిమెళ్ళ స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేణు ప్రసాద్

నేరాలు ఘోరాలు

కాలువలో గల్లంతైన వ్యక్తి మరణం

ప్రజాశక్తి – గోపాలపురం

తాడిపూడి కాలువలో స్నానానికి దిగిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. మండలంలోని వెల్లచింతలగూడెం గ్రామానికి చెందిన జల్లిగ పోసియ్య(30) స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న తాడిపూడి కాలువలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మునిగిపోయిన పోసియ్య మృతి చెందారు. స్థానికులు గాలింపులు చేపట్టి వల సాయంతో మతదేహాన్ని వెలికి తీశారు. మతునికి వివాహం కాలేదని తెలిసారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి – గండేపల్లి

రోడ్డు ప్రమాదంలో నాలుగు రోజుల క్రితం గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మండలంలోని కె.నాయకంపల్లి గ్రామ సర్పంచ్ భర్త మలిరెడ్డి కాశీ విశ్వనాథం (56) గత నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న విశ్వనాథంకి కుక్క అడ్డు రావడంతో రోడ్డుపై పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్‌లో భాగంగా తన భార్యను సర్పంచ్‌గా గెలిపించి, ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ వారికి కావలసిన వసతులను కల్పించిన మంచి నాయకుడిగా ప్రజల్లో మన్ననలు పొందారు. అయితే ఆకస్మాత్తుగా రోడ్డు ప్రమాదం సంభవించి ఆకస్మిక మృతిని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మండలంలోని నాయకులు, అభిమానులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

గీత కార్మికునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి – తాళ్లరేవు

మండలం కోరంగి పంచాయతీ బొడ్డువాని లంక గ్రామానికి చెందిన గీత కార్మికుడు విత్తనాల రాంబాబు అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి పోలీసుల కథనం ప్రకారం... గ్రామంలో ఈత కల్లు గీసే ప్రయత్నంలో చెట్టుపై ఉన్న తేనెటీగలను చెదరకొట్టేందుకు చెట్టు కింద పొగ పెట్టాడు. నెత్తిపై మంటను వేసుకుని చెట్టు ఎక్కారు. ఈ నేపథ్యంలోనే పొగ రాజుకుని మంటలు ఎగిసిపడటం దట్టమైన పొగ కమ్ముకోవడంతో చెట్టు పైనుంచి దిగలేని పరిస్థితిలో చెట్టు నుంచి కిందకు జారిపోయి మంటల్లో పడ్డాడు. ఈ ప్రమాదంలో అతను 80 శాతానికిపైగా కాలిపోయినట్టు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో పొలిటికల్ అటెన్షన్

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబుకు జైలులో అస్వస్థతకు గురవటంతో పొలిటికల్ అటెన్షన్ నెలకొంది. చంద్రబాబు ఆరోగ్యంపై మూడ్రోజులుగా వస్తున్న కథనాలు ఆ పార్టీ శ్రేణులను, కటుంబ సభ్యులనుఉ కలవరానికి గురి చేస్తున్నాయి. ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. అయితే అరోగ్య పరిస్థితిపై రెండ్రోజులుగా ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ టిడిపి నేతలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమ అధినేతను జైలులోనే అంతమొందించే కుట్ర జరుగుతోందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అధినేతను అక్రమంగా అరెస్టు చేశారంటూ చేస్తున్న ఆందోళనలలో భాగంగా ఇటీవల నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. అనుమతులు లేవంటూ పోలీసులు అడ్డుకోవటం వంటి పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ యంత్రాంగం చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నారని అపోహలొద్దంటూ ప్రకటనలు చేయటం ఆ పార్టీ శ్రేణులను ఒకింత గందరగోళానికి గురిచేస్తోంది. చంద్రబాబు చర్మ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే తీవ్రత పెరిగే ప్రమాదం లేకపోలేదని వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు. అయితే తాము జైలు నిబంధనలకు లోబడి వసతులు కల్పించగలమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. చంద్రబాబు వయసు, ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యేక వసతులు కల్పించాలని కుటుంబ సభ్యులు, టిడిపి శ్రేణులు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ విజ్ఞప్తిపై ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఎలక్షన్ అటెన్షన్

తెలంగాణలో ఎన్నికలు నేపథ్యంలో జిల్లాలోనూ పొలిటికల్ అటెన్షన్ నెలకొంది. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన విషయం విదితమే. రాష్ట్రంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు రాబోతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల స్వయంగా వెల్లడించారు. దీంతో అధికార పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యచరణను ప్రకటించింది. టిడిపి యువనేత యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన విషయం విదితమే. తమ పార్టీ అధినేత అరెస్టుతో ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రస్తుతం తమ అధినేతను అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ శ్రేణులు బాబుతో నేను అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు చంద్రబాబు సతీమణి యాత్ర చేపట్టనున్నారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇంకో వైపు అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియకు సంబంధిచిన కసరత్తును ప్రారంభించాయి. చక చకా జరుగుతున్న ఏర్పాట్లు ఎన్నికల ప్రకటన ఎప్పుడొచ్చినా సిద్ధమని తెలుస్తోంది. అయితే తెలంగాణలో కొన్ని స్థానాల్లో సెటిలర్స్ ఓట్లు ప్రభావితం చేయనున్నాయా? అంటే ఔననే సమాధానం విన్పిస్తోంది. జిల్లాలోని అత్యధిక మంది విద్యావంతులు హైద్రాబాద్‌లో స్థిర పడిన విషయం విదితమే. ఇటీవల చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టిడిపి అభిమానులు కార్లలో ర్యాలీగా రాజమహేంద్రవరానికి చేరుకుని తమ సంఘీభావం తెలిపారు. తాజాగా చంద్రబాబుకు మద్దతుగా అక్కడ కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. చంద్రబాబు అరెస్టుపై ఒకొక్కటిగా అభిప్రాయం వ్యక్తం చేయడం సెటిలర్స్ ఓట్ల కోసమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యుత్ భారాలపై కొనసాగుతున్న పోరాటాలు

విద్యుత్ భారాలపై వామపక్ష పార్టీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇటీవల దశల వారీ ఉద్యమాన్ని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలత జగన్ ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచింది. ఇప్పటికే నిత్యావసర సరుకులు, పన్నుల భారాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ భారాలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. రెట్టింపు బిల్లులు రావటంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు సమరశీల పోరాటాలు నిర్వహించిన విషయం విదితమే. ఆ పోరాటాల ఫలితంగా రెండు దశాబ్దాల పాటు పాలక ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల జోలికి పోలేదు. తాజాగా వైసిపి ప్రభుత్వం దశలవారీగా పెంచుతూ వెళ్లడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి విద్యుత్ ఛార్జీలపై విధానపరమైన నిర్ణయం తీసుకోకుంటే అధికారానికి దూరం కావటం ఖాయమనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

యానాం వార్తలు

డిప్యూటీ సర్వేయర్‌గా పాపారావు

ప్రజాశక్తి – యానాం

యానాం సర్వే విభాగం డిప్యూటీ సర్వేయర్‌గా బివి.పాపారావును నియమిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ పి.సెంథిల్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం యానాం సర్వే విభాగంలో ఫీల్డ్ సర్వేయర్గా విధులు నిర్వహిస్తున్న పాపారావుకు డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీ సిఫారసు మేరకు డిప్యూటీ సర్వేయర్ గా అడ్ హక్ బేసిస్ పై నియమించారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పుర్తి

ప్రజాశక్తి – యానాం

యానాం పరిధిలోని దేవీ నవరాత్రి మహోత్సవాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. పడవల రేవు వీధిలో ఉన్న లలితా దేవి, గోపాల్ నగర్, కనకాల పేట, మెట్టకూరు, దొమ్మేటి పేట, గిరియంపేట కుర్సంపేట, వెంకట్ నగర్ ప్రాంతాలలో ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కనకాలపేట శ్రావణి దుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 6. 56 నిమిషాలకు కోనంబట్ల శ్రీరామ చంద్ర మూర్తి శర్మ ఆధ్వర్యంలో పుగాకు లోవరాజు పద్మావతి దంపతులచే దుర్గాదేవి కలశ స్థాపన చేయనున్నారని ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కనకాల కష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరుకానున్నారు.

బాల్ బాడ్మింటన్ పోటీలకు యానాం క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి – యానాం

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు యానాం నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సెక్రటరీ కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్ పూర్‌లో నిర్వహించే 42వ సబ్ జూనియర్ నేషనల్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలలో యానాం నుంచి బళ్లా ప్రవల్లిక, ఆలపాటి సంజన, గుర్రాల శ్రీ వల్లీ, కర్నీడి శివ సత్య కిషోర్, వాకపల్లి శశిధర్, పాలెపు యోనంత్, కట్టుంగి మనిదీప్ లు పుదుచ్చేరి రాష్ట్ర బాలుర మరియు బాలికల జట్టుకు ఎంపికయ్యారు. ఈ బృందానికి కోచ్‌గా బోట్టా శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.ఎంపిక అయిన క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎస్ఐ అభ్యర్థుల తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష మొదటి రోజు శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 4162 మంది అభ్యర్థులకుగాను ఉదయం పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం పరీక్షకు 53 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం సమయానికే ప్రతి అభ్యర్థినీ పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి మరీ తనిఖీలు నిర్వహించారు. హాల్ టిక్కెట్‌తోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు. చేశారు. ఉదయం పరీక్ష 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, రెండో పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించారు. డిఐజి జివిజి.అశోక్‌కుమార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్, ఏలూరు అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు బందోబస్తును పర్యవేక్షించారు.

'సంక్షేమ పథకాలను సహించని వర్మ'

ప్రజాశక్తి –యు.కొత్తపల్లి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి మాజీ ఎంఎల్ఎ వర్మ సహించలేకపోతున్నారని పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొమరగిరిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు వివిధ సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఎంఎల్ఎ ప్రజలకు హామీ ఇచ్చారు..

ఎంఎల్ఎను నిలదీసిన సర్పంచ్ సత్యశ్రీ

గ్రామంలో గడపగడపకూ కార్యక్రమం తనకు సమాచారం ఇవ్వలేదని, ప్రజలకు తాను ఏమి సమాధానం చెప్పాలంటూ సర్పంచ్ సత్యశ్రీ ఎంఎల్ఎ దొరబాబును నిలదీశారు. గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాన్ని నిలిపేందుకు సత్య శ్రీ ఉండగా,ఈలోగా వైసిపి నాయకులు సుదర్శన్,కారే శ్రీనివాసరావు వారిద్దరూ కలిసి సర్పంచికి నచ్చచెప్పే ప్రయోగాలు చేశారు. కానీ సర్పంచ్ కన్నీరు పెట్టుకుని గ్రామాల్లో ఇంకా సమస్యలు ఉన్నాయి మీఇష్టం సారంగా వచ్చి తిరిగేస్తే ఎలాగా నాకు కూడా సమాచారం ఇవ్వాలి కదా అని ఆమె నాయకులుపై మండిపడ్డారు. ఈ రోజు మీరు తిరిగి వెళ్తారు నేను గ్రామ సర్పంచ్ నీ రేపు ప్రజలు నన్ను అడుగుతారని ఆమె కన్నీరు మున్నీరుగా విలపించారు.

కాలువ రెగ్యులేటర్ పనుల పరిశీలన

ప్రజాశక్తి – పెద్దాపురం

కాండ్రకోట గ్రామంలోని ఏలేరు కాలువ బెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.ఈ పనుల నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దాపురం పర్యటన సందర్భంగా రూ.6 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు సంబంధించి శనివారం జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్ ఈ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకిడి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గవరసాన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య ఇసిఇ విభాగంలో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి–గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో 'బియాండ్ ది బేసిక్: అడ్వాన్స్ డిజిటల్ డిజైన్ యూజింగ్ వేరి లాగ్' అంశంపై శనివారం గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన లాజిక్ ఫ్రూట్ టెక్నాలజీ, ఆర్‌టిఎల్ డిజైన్ ఇంజనీర్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి చింతలపూడి హేమంత్ లెక్చర్‌లో పాల్గొన్నారు. డీన్స్ జి.సురేష్, వి.సత్యనారాయణ, హెచ్ఒడిలు ఎన్. రాధ, కర్ణ విష్ణు వర్ధన్ రెడ్డి, కో ఆర్డినేటర్ ఎండి.తాజ్ మాట్లాడారు.

బొప్పాయి లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి –జగ్గంపేట రూరల్, కిర్లంపూడి

బోల్తా పడిన బొప్పాయి లోడు లారీ

కిర్లంపూడి మండలం 16వ జాతీయ రహదారిపై బొప్పాయి లోడు లారీ బోల్తా కొట్టింది. దీనికి సంబంధించి హైవే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున ఏలూరు నుంచి బీహార్ వెళ్లున్న బొప్పాయి లోడుతో ఉన్న లారీ కిర్లంపూడి మండలం బూరుగుపూడి వద్దకు వచ్చేసరికి టైర్ ఫంక్చర్ అయ్యింది. దీంతో లారీ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో బొప్పాయి కాయలు హైవేపై పడటంతో అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియత్రించారు. అయితే ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. బొప్పాయి లోడు కాస్తా ఒక వైపుకు ఉండటంతో ఒరిగి బోల్తా కొట్టిందని డ్రైవర్ తెలిపాడు.

రామచంద్రపురం నదురు బాద మెయిన్ రోడ్డు దుస్థితి

గోతులమయంగా నదురుబాద రోడ్డు

ప్రజాశక్తి–రామచంద్రపురం

రామచంద్రపురం నుంచి నదురుబాద వెళ్లే మెయిన్ రోడ్ గత పదేళ్లుగా పూర్తిగా పాడై ఉంది. ఛిద్రమైన ఈ మెయిన్ రోడ్డుపై నడిచేందుకు కూడా వీలు లేకుండా రాళ్లు లేచిపోయి అధ్వాన్నంగా తయారైంది. రామచంద్రపురం నుంచి నదురబాద మీదుగా వెదురుపాక చేరేందుకు ఈ రోడ్డును దగ్గర దారి కావడంతో ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు పాడైపోవడంతో రామచంద్రపురం పరిసర ప్రాంతాల వారు పసలపూడి మీదుగా వెదురుపాక వెళు తున్నారు. అయితే నదురుబాద వెళ్లే ప్రజలకు మాలపాడు వెళ్లే ప్రయాణికులకు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 7 కిలోమీటర్లు పాడైన ఈ మెయిన్ రోడ్డు కొత్తూరు నుంచి నదురుబాద మీదుగా వెదురుపాక వెళ్లేందుకు దగ్గర దారి అయినప్పటికీ ఎవరో దీన్ని ఉపయోగించడం లేదు. ఇక వర్షం వస్తే ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి అవస్థలు తప్పడంలేదు. పదేళ్లుగా పాడైపోయిన ఈ రోడ్డును పట్టించుకునే నాథుడే లేడని నదురుబాద,మాలపాడు వెదురుపాక గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రామచంద్రపురం–నదురుబాద రోడ్డు ఆధునికీకరించాలన్నారు. వెదురుపాక వెళ్లేందుకు దగ్గర కావడంతో పాటు రైతులకు ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

కాలువలో గుర్రపుడెక్క తొలగించాలి

ప్రజాశక్తి–మండపేట

తాపేశ్వరం లాకుల పరిధిలోని తాపేశ్వరం నుంచి అర్తమూరు మీదుగా వెళ్లే రాయవరం మండలంలోని వెదురుపాక వరకు వెళ్లే ప్రధాన పంటకాలలో గుర్రపు డెక్క, తూటి కాడ విపరీతంగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సాగునీటికి అవరోధం కలుగుతుందని రైతులు అంటున్నారు. గుర్రపు డెక్క, తూటి కాడ విపరీతంగా పెరిగిపోవడంతో సాగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. మరి కొద్ది రోజుల్లో పంట చేతికి రానున్న నేపథ్యంలో వరి పంటకు నీటి అవసరం ఎంతైనా ఉంటుందని నిరంతరాయంగా నీరు ప్రవహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టి గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి–ఉప్పలగుప్తం

వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గ్రామీణ ఫొటో, వీడియో గ్రాఫర్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కషి చేయాలని లూయిస్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గొల్లవిల్లిలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల సంక్షేమానికి కషి చేస్తున్నట్టుగానే తమ వత్తిని కూడా గుర్తించి తగు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి జానా భవాని శంకర్, బొక్కా పుల్లంశెట్టి,జంగా రవికుమార్, దేవదాసు రాజేష్ కుమార్,అంబటి వెంకటేశ్వరరావు, చోడిశెట్టి ఆదినారాయణ, ముంగండ సత్తిబాబు, మోసుగంటి ప్రసాద్,దోనిపాటి రాంబాబు, పోలినాటి భీమేశ్వరరావు, అంబటి నరేష్, కొంకి అరవింద్,సూదా వెంకటరత్నం, డి.నాగరాజు, పిల్లే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

మృతుల కుటుంబాల సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి–మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం పరామర్శించారు. పట్టణంలోని 15,17 వార్డులకు చెందిన కొత్తపల్లి రాఘవ, రామకృష్ణ పంతులు, మండలంలోని మారేడుబాక గ్రామంలో కురుపూడి నాగేశ్వరరావుల కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పసలపూడి శ్రీనివాసరావు, రాయుడు గంగరాజు, పాలచర్ల వెంకన్నబాబు, పాలచర్ల శిరీష్, తదితర్లు ఉన్నారు.

క్రైస్తవ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి–ఆత్రేయపురం

క్రైస్తవ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్ర రాష్ట్ర క్రైస్తవ సంఘాల అధ్యక్షుడు మండలంలో ర్యాలీ గ్రామానికి చెందిన పియస్.రెడ్డి జయపాల్ సిఎం జగన్‌ను కలిసి విన్నవించారు. శనివారం సిఎం కార్యాలయంలో క్రైస్తవ నాయకుల సమావేశము జరిగింది. ఈ సమావేశంలో జయపాల్ 13 అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ టిక్కెట్లు కేటాయించంలో ఎంపీ, ఎంఎల్ఎ, ఎంఎల్‌సి ఎన్నికల్లో క్రైస్తవ వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం క్రైస్తవ సంఘ అవసరాల మేరకు అన్ని మండలాల్లో శ్మశాన వాటికల కోసం భూమిని కేటాయి ంచడం క్రైస్తవ మంది రాలకు గుర్తింపు, నూతన మందిర నిర్మాణాలకు పారదర్శక సూచ నలు తది తర అంశాలను సిఎంకు విన్నవిం చారు.

అంబేద్కర్ ఆశయాలతో ముందుకు సాగాలి

మహిళలకు చీరలు అందజేస్తున్న సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి–అమలాపురం రూరల్

ప్రతి ఒక్కరూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులు ఉప్పె సత్యనారాయణ మూర్తి అన్నారు. అమలాపురం మండలం సాకుర్రు పంచాయితీ పరిధిలో బుద్ధానగర్ ఎం ఎస్ ఎన్ కాలనీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఉప్పె సత్యనారాయణమూర్తి సౌజన్యంతో సమకూర్చిన చీరలను సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం పేద మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానాలతో కుల మతాలకు అతీతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పేద విద్యార్థులు విద్యపై ఆసక్తి చూపి అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన ఫలాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సర్పంచ్ చిరంజీవిరావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణలు మాట్లాడుతూ నిరుపేదవారికి అండగా ఉంటూ సేవా దక్పథంతో ముందుకు దూసుకుపోతున్న మాస్టర్ సత్యనారాయణమూర్తి ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సత్యనారాయణమూర్తి ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, రాష్ట్ర మెరిటోరియాస్, జాతీయ మహాత్మా గాంధీ ఫిలోత్రోఫిక పురస్కారాలను కైవసం చేసుకున్నారని అన్నారు. అనంతరం గ్రామస్తులు దుశ్శాలువాతో సత్యనారాయణమూర్తి మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ములపర్తి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

పడమర ఖండ్రికలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి–కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని పడమర ఖండ్రిక గ్రామ సచివాలయం లో శనివారం గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా జరిగిన వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహి ంచి పౌష్టికాహారం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ కె.సూర్యారావు, పలు శాఖల అధికారులు, వైసిపి నాయకులు, వైద్యాధికారులు డాక్టర్ పిఎన్ఎస్ డి.రత్నకుమారి, ఎన్ కరుణేంద్ర కుమారి, కె.రమ్య లక్ష్మి, వి.కృష్ణలోకేష్, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు

కార్యక్రమంలో పాల్గొన్న సాయిరామ్ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి–ఐ.పోలవరం

విద్యార్థులను నైపుణ్యాలను పెంపొందించుకుని ఉనత్న స్థానాలకు చేరుకోవాలని సాయిరామ్ విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు అన్నారు. గుత్తెనదీవి సాయిరామ్ విద్యానికేతన్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్–1 శనివారం నిర్వహించారు. ఇంటర్నేషనల్ కరిక్యులం ద్వారా లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌కు సంబంధించి 100 మంది విద్యార్థిని, విద్యార్థులు నేర్చుకొన్న విషయాలను సెమినార్ ద్వారా తల్లిదండ్రులకు, తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలా చేయడం ద్వారా విద్యార్థిలో అంతర్గతంగా దాగిఉన్న ఆలోచనతో కూడిన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. సెమినార్స్ లో విద్యార్థులకు చెప్పిన ముఖ్యమైన11 అంశాలను వివరించారు. అనంతరం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో లీడ్ స్కూల్ అకాడమిక్ ఎక్స్ లెన్స్ మేనేజర్ లక్ష్మణ్ వారణాసి, ఉదయ్ మాట్లాడుతూ లీడ్ స్కూల్ లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో పాఠ్యాంశాలు ఉంటాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మంచి జాబ్ సంపాదించడానికి ఈ ప్రోగ్రామ్స్ డిజైనింగ్ ఉంటుందన్నారు. అన్ని క్లాస్ రూమ్స్‌లో స్మార్ట్ టీవీ, ట్యాబ్‌తో అనుసంధానం చేయబడి విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాగాపు సీతారత్నం, ఉపాధ్యాయులు నాటి ధనరాజు, బొమ్మిడి నాగేంద్ర వర్మ, జనిపెల్ల వెంకటేష్, మెల్లం సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు:: రాజమహేంద్రవరం

F.D.P.No. 4/2023
in O.S.No. 131/2015

Between:

Borra Nagamani, W/o. Ganga Raju, Hindu, Aged 67, Stridhana, R/o. D.No. G-2, Jetty Delux Apartments, D.No. 75-6-21/1, Prakash Nagar, Rajahmundry.
...Petitioner

AND

1) Borra Durga Bhavani, W/o. Late Naga Raju, Hindu, Age 45, 10th Ward, D.No. 21-1-12, Tummalava, Rajahmundry.
2) Borra Mohan Sai Siva Ram, S/o. Late Naga Raju, Hindu, Age 20, 10th Ward, D.No. 21-1-12, Tummalava, Rajahmundry.
3) Borra Karthikeya, S/o. Late Naga Raju, Hindu, Age 17, 10th Ward, D.No. 21-1-12, Tummalava, Rajahmundry.
...1,2,3 Respondents

పై నెంబరు పిటీషనులో 1,2,3 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.20-10-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి, 14-10-23.
ఎం.శివప్రసాద్
అడ్వకేట్, రాజమండ్రి.
సెల్: 94411 22233

దస్తావేజులు పడిపోయినవి

నా క్లయింటు సామర్లకోట మండలం, జి.మేడపాడు గ్రామ కాపురస్తులు అయిన **నున్న నారయ్య గారి కుమారుడు నున్న గంగయ్య** గారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం జి.మేడపాడు గ్రామంకు చెందిన **ఎస్.నెం. 475, దాక్యుమెంటు నెం. 1786/1978** గా గల ఒరిజినల్ దస్తావేజు జిరాక్సు నిమిత్తం ది.09-10-2023వ తేదీన ఆర్.బి.పట్నం గ్రామం నుండి బయలు దేరి పెద్దాపురం పట్టణం మెయిన్ రోడ్డులో జిరాక్సు నిమిత్తం వెళ్ళగా నా క్లయింటు ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. దీని నిమిత్తం పెద్దాపురం పోలీసు వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. పైన తెలిపిన డాక్యుమెంటు ఒరిజినల్ ఎవరికైనా దొరికిన ఎడల పెద్దాపురం పోలీసు వారికి గాని ఈ క్రింది తెలిపిన అడ్రసుకు గాని తెలియపరచవలెను.

గుణ్ణం రవికుమార్
అడ్వకేట్, మెయిన్ రోడ్, సామర్లకోట.
సెల్: 96768 04050

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 113/2023

బిట్వీన్:

నందికి విజయభాస్కర్ ***...పిటీషనరు***

మరియు

నందికి (పెయ్యల) నాగరత్నం **...రెస్పాండెంటు**

టు: నందికి (పెయ్యల) నాగరత్నం, భర్త: నందికి విజయ భాస్కర్, గృహిణి, హిందూ, వయస్సు 40 సం॥లు, జగ్గయ్య చెరువు కాలనీ, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు గల పిటీషనులో పైన తెలుపబడిన కోర్టులో మీరు రెస్పాండెంటు అయి ఉన్నారు. కావున ఈ ప్రకటన ద్వారా మీకు తెలుపబడినది ఏమనగా పైన తెలుపబడిన కోర్టు వారు మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ది.18-10-2023వ తేదీన పై కేసులో మీకు **వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు ప్రత్యక్షంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్నా తెలుపగలరు.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రచురించడమైనది)

వాయిదా తేది: 18-10-2023

గుదిమెళ్ళ శ్రీభాస్కరాచార్యులు
అడ్వకేట్, పిఠాపురం.
సెల్: 81216 78123